లాస్య మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే మృతి పట్ల పార్టీ ప్రముఖుల దిగ్భ్రాంతి
- నామా, వద్దిరాజు, తాతా మధు, అజయ్‌కుమార్ సంతాపం

ఖమ్మం, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మృతి పట్ల పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ ప్రముఖ నేతలు అన్నారు. ఆమె మరణం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని పార్టీ నేతలైన ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు, మదన్‌లాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా పనిచేసిన ఆమె తండ్రి సాయన్న గత ఫిబ్రవరిలో మరణించారని, దాని ఇంకా కోలుకొకముందే లాస్య మృత్యువాత పడడం బాధను కలిగిస్తోందని అన్నారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలు పొందుతున్న లాస్యను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడం దురదృష్టకరమని అన్నారు. ఆమె కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

- పది మంది కూలీలకు తీవ్ర గాయాలు
- అందులో ముగ్గురి పరిస్థితి విషమం
- చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలింపు

కల్లూరు, ఫిబ్రవరి 23: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో పది మంది కూలీలకు తీవ్ర గాయాలు కాగా.. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన కల్లూరు మండలం పెద్దకోరుకొండి రైతు వేదిక సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన 10 మంది కూలీలు ఆటో కిరాయికి మాట్లాడుకుని కల్లూరు మండలంలోని ఓ గ్రామంలో మిర్చి కోసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దకోరుకొండి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో ప్రమాదవశాత్తు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది కూలీలకు తీవ్ర గాయాలు కాగా.. వీరిలో మల్లారపు భద్రమ్మ, చీమకుర్తి కృష్ణమ్మ, బండి పద్మల పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై షాకీర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్న ఎస్సై.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్షతగాత్రులకు అంబులెన్స్‌లో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

ముగ్గురు విద్యార్థులకు గాయాలు.. ఖమ్మం నగరంలో ఘటన..

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 23: నగరంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సును వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో విద్యార్థులకు గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. నగరంలోని శ్రీనగర్ కాలనీలోని కాకతీయ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను వారి ఇంటి వద్ద దించేందుకు బయలుదేరింది. బైపాస్ రోడ్డు టేకులపల్లి వైపు బస్సు డ్రైవర్ బస్సును యూటర్న్ తీసుకుంటుండగా వెనుకనుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. నాలుగో తరగతి చదువుతున్న ఆయాన్ తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలించారు. బస్సు వెనుకభాగం నుజ్జు నుజ్జు అయింది. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

దెబ్బతిన్న బస్సు వెనుక భాగం

'హెచ్‌పీఎస్' దరఖాస్తుల ఆహ్వానం

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 23: 2024-2025 విద్యా సంవత్సరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు కన్తాల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 1-6-2017 నుంచి 31-12-2018 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 12లోగా తమ కార్యాలయంలో అందించాలని సూచించారు.

'హార్వెస్ట్' విద్యార్థిని ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే తపాలాశాఖ ఉపకార వేతనానికి నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి శుక్రవారం తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష లెవల్-2లో తమ విద్యార్థిని శ్రీతనిష్క ప్రతిభ చూపిందని చెప్పారు. కాగా, ఆ విద్యార్థినిని విద్యాసంస్థల అధినేత రవిమారుత్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

దరఖాస్తుకు మార్చి 6 తుది గడువు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 23: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు కన్తాల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా మార్చి 6లోగా చేసుకోవాలని సూచించారు.

'విద్యుత్ సమస్యలపై స్పందించండి'

కూసుమంచి, ఫిబ్రవరి 23: విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని ట్రాన్స్ కో ఏడీఈ కోక్యానాయక్ ఆ శాఖ అధికారులకు సూచించారు. కూసుమంచి సబ్ స్టేషన్‌లో శుక్రవారం జరిగిన వినియోగదారులు, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి'

కొణిజర్ల, ఫిబ్రవరి 23: విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని ఎస్సై జక్కుల శంకర్‌రావు సూచించారు. మండలంలోని పల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'విద్యా విలువలు - ఉన్నత జీవితం' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

కారేపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని కోటిలింగాల వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రదేశాన్ని సింగరేణి అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో ఈ బ్రిడ్జి నిర్మాణ సమస్యలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రస్తావించారు. భక్తుల సౌకర్యార్థం కోటిలింగాల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే, బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని సింగరేణి ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు.

'నిబంధనల మేరకే విక్రయాలుండాలి'

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: నిబంధనలకు అనుగుణంగానే ఎరువుల విక్రయాలు జరగాలని ఏడీఏ విజయచంద్ర సూచించారు. మండలంలోని తల్లంపాడు, మత్తగూడెం గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పొన్నెకల్ రైతువేదికలో ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

డిప్యూటీ సీఎంను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మధిర, ఫిబ్రవరి 23: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మధిర బార్‌అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. మధిరలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవన నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేయించినందుకు పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మధిర కోర్టు భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న మల్టీగ్రెయిన్ మార్కెట్‌లో తాత్కాలికంగా కోర్టు నడుపుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరారు.

గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నా..

రేజర్ల సీసీ రోడ్ల నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి రూరల్/ సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 23: మండలంలోని రేజర్ల గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని, అభివృద్ధి ఈ గ్రామాన్ని తీర్చిదిద్దుతానని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు. రేజర్ల గ్రామంలో రూ.1.70 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్టీలతో సంబంధంలేకుండా గ్రామాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా ఈ 70 రోజుల్లోనే గ్రామంలో రూ.3.58 కోట్లతో, నియోజకవర్గంలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభించినట్లు వివరించారు. ఈజీఎస్ ద్వారా ఈ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దొడ్డా హైమావతి, చిన్న నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

ఈజీ గో షోరూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

పట్టణంలో ఈజీ గో షోరూంను ఎమ్మెల్యే రాగమయి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ చావ్లా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్య రహిత వాహనాన్ని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్: సండ్ర

పెనుబల్లి/ సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 23: బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ కార్యకర్తలను, బాధిత కుటుంబాలను పరామర్శించారు. పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడేనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొమ్మెరపోయిన పూర్ణచంద్రరావు విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూర్ణచందర్‌రావుకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో మృతుడి భార్య నందిని పేరుతో మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా పరిహారం చెక్కును శుక్రవారం ఇంటికెళ్లి అందజేశారు. అలాగే, మండలంలోని భయన్నగూడెం, కొత్తకారాయిగూడెం, కుప్పనగుంట్ల, ఎల్ఎస్ బంజర గ్రామాల్లోని పలు కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు. అలాగే, పెనుబల్లి మండల బీఆర్ఎస్ నాయకుడు సోమరాజు శివరాం ప్రసాద్ (రామప్ప) ఇటీవల ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న సండ్ర.. శుక్రవారం సత్తుపల్లిలోని అతడి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.


బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న సండ్ర

గంజాయి వాడిక పట్టారు.. పోలీసులకు చిక్కారు..

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: సాధారణంగా పల్లెల్లో కల్లువాడిక పట్టి సాయంత్రం వేళ తాగుతుండడం ఆనవాయితీ. అచ్చం అదే తరహాలో గంజాయిని కూడా వాడిక పట్టారు కొందరు యువకులు. చివరికి పోలీసులకు చిక్కారు. ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఖమ్మం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం రూరల్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఖమ్మం నగరానికి చెందిన ఐదుగురు యువకులు జొన్నలగడ్డ ప్రభురామ్, కొప్పు వరుణ్, పోట్ల ఈశ్వర్, సోమవరపు సాయినవీన్, ఎనుబరి జాన్‌లు బైకులపై వస్తున్నారు. పోలీసులు వీరిని ఆపి వారి వాహనాలను తనిఖీ చేశారు. సోదాల్లో 100 గ్రాముల ఎండు గంజాయితోపాటు మరో ప్లాస్టిక్ కవర్‌లో గంజాయిని పీల్చే సీసా ఉన్నట్లు గుర్తించారు. ఈ గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారని ప్రశ్నించగా.. ఏదులాపురం క్రాస్‌రోడ్డుకు చెందిన శంకర్‌తో తమకు పరిచయం ఉందని తెలిపారు. తమ నుంచి రూ.10 వేలు తీసుకొని అడిగినప్పుడల్లా 100 గ్రాముల గంజాయి ఇస్తుంటాడని చెప్పారు. గంజాయిని తీసుకొని వెళ్తా ఖాళీ ప్రదేశంలో ఆగి పీల్చుదామని వెళ్తున్నామని అన్నారు. ఈ క్రమంలో పోలీసులు పట్టుకున్నట్లు వివరించారు. దీంతో పోలీసులు ఆ యువకుల బైకులను, వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై అవగాహన సదస్సు

సత్తుపల్లి, ఫిబ్రవరి 23: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అశోకచక్రవర్తి శుక్రవారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారి ఓట్లు మొత్తం 5 వేలు ఉండగా విచారణ అనంతరం 3 వేల ఓట్లను తొలగించినట్లు చెప్పారు. తదుపరి క్షేత్ర విచారణ అనంతరం మిగతా ఓట్లను కూడా తొలగిస్తామని, ఇంకా అలాంటి ఓట్లు ఎక్కడైనా ఉంటే అఖిలపక్ష బాధ్యులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

శ్రీచైతన్య కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని పొన్నెకల్లులో ఉన్న శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియమకాలు జరిగాయి. ప్రీమియర్ ఎనర్జీ పోటో వోల్టోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన నియామకాల్లో 43 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పన్నాల కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రాంగణ నియామకాలకు విద్యార్థులు ఎంపికయ్యే విధంగా బోధన ఉంటుందని అన్నారు. హెచ్ఆర్ రవి, కళాశాల సీఈవో, ఈడీ డాక్టర్ సాయి గీతిక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ పన్నాల కృష్ణమూర్తి

'పాఠశాలలపై దాడులు సమంజసం కాదు'

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23: ఫీజులు చెల్లించలేదని అడిగితే ప్రైవేట్ విద్యా సంస్థలపై దాడులు చేయడం సమంజసం కాదని ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ ఐవీ రమణారావు, జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు అన్నారు. నగరంలోని శుక్రవారం క్రియేటివ్ హైస్కూల్లో విద్యార్థి బంధువులు పాఠశాల సిబ్బందిపై దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడిచేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా, క్రియేటివ్ స్కూల్ బాధ్యులకు నగరంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు మద్దతు తెలిపాయి. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు మతీన్, శ్రీకాంత్, సూరిబాబు, సాంబశివారెడ్డి, వీరన్న, ప్రసాద్, రవిమారుత్, అప్పారావు, శశధర్‌రెడ్డి, రాంప్రసాద్, యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్కూల్స్ యాజమాన్యాల సంఘం బాధ్యులు

ఇంటర్‌లో కష్టపడి చదవాలి: ట్రాఫిక్ ఏసీపీ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23: నగరంలోని సిరి చైతన్య జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వేడుకలకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ దశలోనే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకుంటారన్నారు. వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్య, క్రెడాయ్ చైర్మన్ కొప్పు నరేశ్, ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షుడు కాంతారావు, శశిధర్‌రెడ్డి, మధు, రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 23: అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఎర్రుపాలెం మండలంలో శుక్రవారం పర్యటించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్షించారు. ఓటర్ల నమోదు, రెవెన్యూ సమస్యలు, ధరణి రిజిస్ట్రేషన్ల గురించి తహసీల్దార్ ఉషాశారదను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

యాసంగి వరి పంటల పరిశీలన

కారేపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని కోటిలింగాల సమీపంలోగల యాసంగి వరి పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ఉమా మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వివిధ రకాల తెగుళ్లు వ్యాపించినట్లుగా గుర్తించారు. వీటి నివారణ చర్యలను రైతులకు వివరించారు.

యాసంగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పుస్తెల తాడు చోరీ

కారేపల్లి, ఫిబ్రవరి 23: దొంగలు బంగారం చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన వీరెల్లి శ్యాంసుందర్ కుటుంబం మూడు రోజుల కిందట మేడారం జాతరకు వెళ్లింది. శుక్రవారం తిరిగొచ్చేసరికి ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉంది. బీరువా కూడా పగులగొట్టి ఉంది. అందులోని మూడు తులాల పుస్తెల తాడు కనిపించలేదు. శ్యాంసుందర్ ఫిర్యాదుతో కేసును ఎస్సై రాజారాం దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తం

మహిళలకు వర్క్‌షాప్

వైరా టౌన్, ఫిబ్రవరి 23: వైరాలోని నిరుద్యోగ మహిళలకు శ్రీకన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం వర్క్‌షాపును ప్రొడక్టివిటీ కౌన్సిల్ నిర్వహించింది. జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, ఏపీసీసీ కోఆర్డినేటర్ సత్యం, శిక్షకులు వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు

వైరా టౌన్, ఫిబ్రవరి 23: స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఠాగూర్ విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

వైరా టౌన్, ఫిబ్రవరి 23: పట్టణంలోని 2,3 వార్డులకు చెందిన కొందరు తమ ఇళ్ల పక్కనే ఉన్న వైరా రిజర్వాయర్ శిఖం భూములను ఆక్రమించారు. తాము పేదలమంటూ, నివాసం కోసమని గుడిసెలు వేసుకున్నారు. వీటిని వైరా గిర్దావర్-1 ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఆక్రమణదారుల వివరాలు సేకరించారు.

ముగిసిన కరాటే శిక్షణ

సత్తుపల్లి, ఫిబ్రవరి 23: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బాలికల కరాటే శిక్షణ శుక్రవారంతో ముగిసింది. 75 మంది శిక్షణ పొందారని, అందులో 10 మంది బాలికలు ప్రతిభ కనబర్చారని కరాటే మాస్టర్ పిచ్చయ్య తెలిపారు. బాలికలకు హెచ్ఎం సరోజిని బహుమతులు అందజేశారు. అదేవిధంగా జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సర విద్యార్థులకు కరాటే శిక్షకురాలు నడ్డి శైలజ శిక్షణ ఇచ్చారు.

గ్యాస్ వినియోగదారులకు అవగాహన సదస్సు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 23: మండలంలోని జింకలగూడెంలో శుక్రవారం ఇండేన్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది వినియోగదారులకు జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు కొత్త గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 23: డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మంజూరు చేసిన నిధులతో పలు సీసీ రోడ్ల నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. జమలాపురంలో రూ.5 లక్షలు, రామన్నపాలెంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఎంపీపీ దేవరకొండ శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 23: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు ఎస్‌జేకేఎం కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థినులు మంచిగా చదువుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. హెచ్ఎం జీవీఎన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి'

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 23: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ కోరారు. ఈ మేరకు మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

నేడు 'హార్వెస్ట్ ప్రైమరీ' వార్షికోత్సవం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23: నగరంలోని హార్వెస్ట్ ప్రైమరీ క్యాంపస్ వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. ముఖ్య అతిథులుగా డీఈవో సోమశేఖరశర్మ, చైర్మన్ యలమంచిలి నాగమణి పాల్గొననున్నట్లు చెప్పారు.

సాయుధ పోరాటయోధుడు మృతి

బోనకల్లు, ఫిబ్రవరి 23: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతాంగ సాయుధ పోరాటయోధుడు మచ్చ వైకుంఠం (95) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఆయన మృతి పట్ల సీపీఐ, సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు.

మధిరలో వాహనాల తనిఖీ

మధిర, ఫిబ్రవరి 23: స్థానిక ఎస్సై సంధ్య తన సిబ్బందితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున మధిర పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. మధిరలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో తెల్లవారుజామునే పట్టణంలోని ప్రతి షాపునూ తనిఖీ చేశారు. అనంతరం రోడ్లపై నెంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్న వాహనాలు అదుపులోకి తీసుకున్నారు. వాహనదారులకు సూచనలు చేశారు.

పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై సంధ్య

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **వైరా బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికీ తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనభా చేయించుకొని **బానోతు పుష్పావతి,** W/o: **బానోతు నాగేశ్వరరావు,** వయస్సు : 32 సం॥లు, నివాసం : ఇ.నెం. 4-60, రాజ్యతండ గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా రిజిష్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, వైరా సబ్ రిజిష